క్లుప్తంగా

నాగారపమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో నాగారపమ్మ

సుండుపల్లె : మహిమ గల తల్లి.. భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారం బండకాడ ఈడిగ పల్లెలో కొలువైన శ్రీ నాగారపమ్మకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. అంతకు ముందు ఆలయ పూజారులు అమ్మవారికి అభిషేకాలు, పూజలు జరిపి విశేషంగా అలంకరించారు. మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి నాగారపమ్మను దర్శించి పూజలు చేయించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

ఓబులవారిపల్లె : నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 12 లక్షల, 40 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ అరవ శ్రీధర్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. చిట్వేలి, పెనగలూరు తదితర మండలాల్లోని 11 గ్రామాల్లో 11 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకురాలు ముక్కా వరలక్ష్మి, బత్తిన వేణు గోపాల్ రెడ్డి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భాకరాపేటకు చేరుకున్న పాదయాత్ర



భాకరాపేటకు చేరిన పాదయాత్ర భక్తులు

సిద్దవటం : దువ్వూరు మండలం గుడిపాడు గ్రామస్తుల తిరుమల పాదయాత్ర ఆదివారం సిద్దవటం మండలం భాకరాపేటకు చేరుకుంది. ఈ సందర్భంగా పాదయాత్ర భక్తులు మాట్లాడుతూ తాము 10వ తిరుమల యాత్ర చేపడుతున్నామన్నారు. సుమారు 85 మంది భక్తులకు ఈ పాదయాత్రతో తిరమలకు వెలుతున్నామన్నారు. జూలై 5వ తేదీ నాటికి స్వామి వారి దైవ దర్శనానికి వెళ్లే విధంగా ఈ పాదయాత్రను కొనసాగిస్తున్నామన్నారు.

బాధ్యతల స్వీకరణ



నగేష్, సీహెచ్ఓ

పెనగలూరు : పెనగలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్ఓగా నగేష్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీహెచ్ఓ సురేంద్రరాజు ఓబులవారిపల్లికి బదిలీ కాగా ఓబులవారిపల్లిలో సీహెచ్ఓగా పనిచేస్తున్న నగేష్ పెనగలూరుకు బదిలీపై వచ్చారు.

రసవత్తరంగా క్రికెట్ మ్యాచ్‌లు



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీ అందుకుంటున్న వర్మ

నందలూరు : మండలంలోని అరవపల్లి జెడ్పీ హెచ్ఎస్‌లో జరుగుతున్న క్రికెట్ టోర్నీ రసవత్తరంగా సాగుతోంది. ఆదివారం జరిగిన మొదటి మ్యాచ్‌లో మంటపంపల్లె జట్టుపై దుర్గాపురం విజయం సాధించింది. జట్టు విజయంలో ప్రధాన పాత్ర పోషించిన వర్మ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కు ఎంపికయ్యాడు. అనంతరం జరిగిన మ్యాచ్‌లో ఆడపూరుపై లేబాక జట్టు విజయం సాధించింది. లేబాక జట్టు ఆటగాడు మధు 4 వికెట్లను తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ రెండు మ్యాచ్‌లకు అంపైర్లుగా బన్నీ, హరి స్కోరర్‌గా నవీన్‌లు వ్యవహరించారు.

రాయుడు బాటలోనే తానూ



మాట్లాడుతున్న సుగవాసి ప్రసాద్‌బాబు

చిన్నమండెం : దివంగత ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడు బాటలోనే తానూ పయనించనున్నట్లు టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని మల్లూరు క్రాస్ శ్రీరామ్‌నగర్ కాలనీలో సుగవాసి పాలకొండ్రాయుడు సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పాలకొండ్రాయుడు ఎంతో పేరొందారన్నారు. ఆయన అడుగుజాడల్లోనే తాను కూడా నడిచి ప్రజాక్షేత్రంలో కొనసాగుతానని తెలిపారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల పక్షానే తాను ఎల్లప్పుడూ ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు, సుగవాసి అభిమానులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుంది



పార్టీ నాయకులు, అభిమానులతో మాట్లాడుతున్న గడికోట శ్రీకాంత్ రెడ్డి



లక్కిరెడ్డిపల్లె: రైతుల సమస్యలు వింటున్న శ్రీకాంత్ రెడ్డి తదితరులు

ఆత్మీయ పరామర్శలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి

రామాపురం (రాయచోటి) : నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రామాపురం మండల పరిధిలోని నల్లగుట్టపల్లి, రాచపల్లి గ్రామ పంచాయతీలలో శ్రీకాంత్ రెడ్డి పర్యటించారు. బి.రాచపల్లిలో ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు మోపూరు భక్తవత్సల రెడ్డి, వేణుగోపాల్ రెడ్డిలను ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద ఉన్న ఎగువ కొవ్వూరివాండ్ల పల్లెకు చెందిన సుబ్బారెడ్డిలను ఆయన వారి వారి గృహాలకు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అలాగే నాయునివారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అమృతనాయుడు తండ్రి వెంకట మల్లప్ప నాయుడు మృతదేహాన్ని స్థానిక నాయకులతో కలిసి శ్రీకాంత్ రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట సర్పంచ్‌లు అయోధ్యపురం నాగభూషన్ రెడ్డి, వెంకట రెడ్డి, సింగల్ విండో మాజీ అధ్యక్షులు పెద్దిరెడ్డి, ఆదినారాయణ రెడ్డి, ఎంపీటీసీ ద్వారకానాథరెడ్డి, నాయకులు యోగీశ్వర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, చిన్నరెడ్డయ్య, వెంకట్రామిరెడ్డి, అయోధ్యపురం పవన్‌కుమార్‌రెడ్డి, అమృతనాయుడు, ఉప సర్పంచ్ రమేష్ నాయుడు, నాగరాజు, వెంకట సుబ్బారెడ్డి, హరి, నాగేంద్ర, ప్రేమసాగర్ నాయుడు, మదనమోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతులు, ప్రజలతో మమేకం

లక్కిరెడ్డిపల్లి : ఆదివారం లక్కిరెడ్డిపల్లి మండలం డి.రామాపురం గొల్లపల్లిలో ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్య తదితర నాయకులతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు, రైతులు శ్రీకాంత్ రెడ్డిని కలిశారు. అదును పోతున్నా వర్షాలు కురవడంలేదంటూ రైతులు ఆయన ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వంలో రైతు భరోసా పెట్టుబడి నిధులు అందక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పాల రేట్లు లీటరుకు రూ.10 తగ్గిందని, ప్రభుత్వ పథకం అందకపోవడం వల్ల చేతి ఖర్చులకు కూడా డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నామని శ్రీకాంత్ రెడ్డి ఎదుట రైతన్నలు ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న హయాంలో రైతులకు ఏ లోటు లేకుండా బతికామని తెలియజేశారు. అనంతరం శ్రీకాంత్‌రెడ్డి డి.రామాపురం గొల్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు బాలే కదిరప్ప అనారోగ్యంతో బాధపడుతూ ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలానే అదే గ్రామానికి చెందిన ఓబులేసును ఆయన పరామర్శించారు. తదుపరి కోనంపేట గ్రామం కొండావాండ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కొండా బలరామిరెడ్డి, లెక్చరర్ కొండా నాగమునిరెడ్డి మాతృమూర్తిని శ్రీకాంత్ రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మాజీ సర్పంచ్ కొండా ప్రసాద్ రెడ్డి, సర్పంచ్ జనార్దన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్దారెడ్డి, రమేష్, ధర్మారెడ్డి, ప్రసాద్ రెడ్డి, పెద్దఓబులేశు, చిన్నఓబులేశు, ముమ్మనబోయన ఓబులేశు, బాలే ఓబులేసు, చాన్ బాషా, నాగేంద్ర బాబు, సూర్యానారాయణ రెడ్డి, వరుణ్, జాకీర్, సభాపతి నాయుడు, నాగేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదిగ మహామేళాను విజయవంతం చేయండి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

రాయచోటి టౌన్ : జూలై 7న ఒంగోలు నిర్వహించే మాదిగ మహామేళాను జయప్రదం చేయాలని ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకుడు రామాంజనేయులు పిలుపునిచ్చారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటం వద్ద ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిక రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) 1994లో ప్రకాశం జిల్లా ఈదుముడిలో పురుడు పోసుకుందన్నారు. ఆ నాటి నుంచి నేటి వరకు మాదిగల రిజర్వేషన్ కోసం ఎన్నో పోరాటాలు సాగించిందన్నారు. ఎస్సీ వర్గీకరణ రద్దు కోసం ఎన్నో ఉద్యమాలు సాగించామన్నారు. అనంతరం పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు బసయ్య, వెంకటరమణ, రెడ్డెయ్య, మహేష్, జ్యోతిష్, కార్తిక్, రాఖి, సాయి, రెడ్డి నరసింహ, కౌషిక్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

జూలై 1 నుంచి యోగా శిక్షణ

కడప ఎడ్యుకేషన్: కడప పటేల్ రోడ్డులోని మిత్ర యోగా కేంద్రంలో జూలై ఒకటో తేదీ నుంచి కొత్త బ్యాచ్‌కు శిక్షణ ఇస్తున్నట్లు యోగా నిపుణులు డాక్టర్ కె.కల్పన, డాక్టర్ ఆర్.రంగనాథ్‌రెడ్డి తెలిపారు. వారు మాట్లాడుతూ శిక్షణతో రోగ నిరోధకశక్తి పెరుగుతుందని, దీర్ఘకాలిక సమస్యల నివారణకు అవసరమైన యోగాసనాలపై శిక్షణ ఇస్తారని తెలిపారు. ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, షట్ క్రియలు, ధ్యానం వంటి యోగ ప్రక్రియలను శాస్త్రీయంగా సాధన చేయిస్తామన్నారు. ఉదయం 5.45 గంటల నుంచి 7.00 గంటల వరకు మొదటి బ్యాచ్, ఉదయం 8.30 గంటల నుంచి 10 గంటల వరకు మహిళలకు రెండో బ్యాచ్ ఉంటుందని చెప్పారు. వివరాలకు 9848861206, 7013238986 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.



ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



కృత్రిమ కాలు కోసం కొలతలు తీసుకుంటున్న చేతన ఫౌండేషన్ ప్రతినిధులు


రాజంపేట టౌన్ : శరీరంలో అవయవాలు కోల్పోయిన వారు ఏమాత్రం నిరుత్సాహ పడకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఎంఈఓ–2 దాసరి సుబ్బరాయుడు తెలిపారు. స్థానిక సబ్‌కలెక్టరేట్ కార్యాలయ సభా భవనంలో ఆదివారం చేతన ఫౌండేషన్ సహకారంతో వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా కృత్రిమ కాలు అమర్చేందుకు కొలతలు తీసుకునే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుబ్బరాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎంతో మంది దివ్యాంగులు కృత్రిమ కాలు అమర్చుకొని దాదాపు అన్ని రకాల పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. అందువల్ల దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. చేతన ఫౌండేషన్ ప్రతినిధి దొడ్డ సీతారామయ్య మాట్లాడుతూ మానవ సేవయే మాధవ సేవ అన్నారు. చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐదువేల మందికి ఉచితంగా కృత్రిమ కాళ్లు అమర్చినట్లు తెలిపారు. అలాగే రెండువేల మందికి ట్రైసైకిళ్లు, రెండువేల మందికి వీల్ చైర్లను ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికసిత ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శూలం లక్ష్మీదేవి, సుబ్బయ్య, అశోక్, నిజస్వరూపుని ప్రార్థనామందిరం పాస్టర్ విశ్వప్రసాద్, జననీసేవా సంస్థ ప్రతినిధి మస్తాన్, డిసేబుల్డ్ కమిటీ మెంబర్స్ అబ్దుల్ ఖాదర్, సుబ్బనర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాలివీటి రామలక్ష్మమ్మ వర్ధంతి



రామలక్ష్మమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు

వీరబల్లి : మండల కేంద్రంలో కీ.శే.లు మాజీ మండల ఉపాధ్యక్షురాలు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు, మాజీ సర్పంచ్, మాజీ కో–ఆప్షన్ మెంబర్ గాలివీటి రామలక్ష్మమ్మ నాల్గవ వర్ధంతి వేడుకలను ఆదివారం కుటుంబసభ్యులు ఘనంగా నిర్వహించారు. ఆమె కుమారులైన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గాలివీటి విజయభాస్కర్ రెడ్డి, ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, మనవడు రాజంపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువనాయకులు మదన్ రెడ్డిల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిపారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొని రామలక్ష్మమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. అలాగే కుమార్తె, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సతీమణి స్వర్ణమ్మ కార్యక్రమంలో పాల్గొని తల్లి చిత్రపటం వద్ద నివాళులర్పించారు.



జిల్లాస్థాయి యోగ సాధనకు ముగ్గురు ఎంపిక

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీకి చెందిన ముగ్గురు యోగ సాధనలో మండలం నుంచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. 35 నుంచి 50 సంవత్సరాల విభాగంలో గెలివి నాగసురేంద్రకుమార్ మొదటి స్థానం, నీరజ రెండవ స్థానంలో నిలిచారు. అదే విధంగా 18 సంవత్సరాల విభాగంలో ధోని చరణ్ మొదటి స్థానంలో నిలిచాడు. వీరిని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ శాలువాతో సత్కరించారు. జిల్లా స్థాయికి ఎంపికైన వీరిని మండలంలోని పలువురు అభినందించారు.



పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న మూరీ శివశంకర్‌రెడ్డి

నేడు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం

రైల్వేకోడూరు అర్బన్ : కూటమి ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని గ్రామీణ పంచాయతీరాజ్ వ్యవస్థను కాపాడుకావాలని ఆదివారం వైఎస్సార్సీపీ నియోజకవర్గ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు మూరి శివశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. రాయచోటి నేడు (సోమవారం ఉదయం 10 గంటలకు) అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నామని ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు గ్రామ పంచాయతీల ద్వారా జరిపించి కూలీలకు బిల్లులు చెల్లించాలని తెలిపారు. ఉపాధి హామీ పనులలో జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. 15వ ఫైనాన్స్ కమిషన్ విడుదల చేసిన రూ.1150 కోట్లు స్థానిక సంస్థలకు జమచేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గ్రామాలలో వసూలు చేసిన ఇంటి పన్నులు స్థానిక సంస్థల ఖాతాలలో జమచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కో–ఆప్షన్ సభ్యులు అన్వర్‌బాషా, పట్టణ కన్వీనర్ సీహెచ్ రమేష్, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి నందాబాల, రత్తయ్య, కరీముల్లా, ఆంజనేయులు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

మదనపల్లె రూరల్ : ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. నిమ్మనపల్లె మండలం ఆచార్లపల్లెకు చెందిన రమణ(35), ప్రైవేటు పాఠశాల బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శనివారం వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు వచ్చి తిరిగి వెళ్తుండగా, బైపాస్ రోడ్డు వై జంక్షన్ వద్ద ట్రాక్టర్ ఢీకొంది. గమనించిన స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



పీర్లచావిడిలో ప్రార్థనలు

కడప ఎడ్యుకేషన్ : మొహర్రంను పురస్కరించుకుని కడప పెద్ద దర్గాలో పీర్ల చావిడి వద్ద ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం మైనార్టీ నాయకుడు పఠాన్ ఖాదర్‌బాషా పాల్గొని మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అందరూ మొహర్రం పండుగను జరుపుకొంటారన్నారు.

సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తాం



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

రాయచోటి టౌన్ : సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని మానవత సంస్థ వ్యవస్థాపకులు ఎన్.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాయచోటి ఎస్ఆర్ కల్యాణ మండపంలో నిర్వహించిన ఆ సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సేవ చేయడం ద్వారా సమాజంలో శాంతిని నెలకొల్పవచ్చుని చెప్పారు. అందరి సహకారం లభిస్తే శాంతి సమాజాన్ని నెలకొల్పడానికి తామంతా కృషి చేస్తామన్నారు. అలాగే మానవత కుటంబ సభ్యులు ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతున్నా.. ఏదైనా కారణంతో మృతి చెందిన వారికి సంస్థ నైతికంగా ఓదార్పునివ్వడంతో పాటు అండగా నిలుస్తుందని చెప్పారు. అనంతరం నూతన కమిటీ సభ్యుల ఎంపికను రాయచోటి చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి, పూర్వపు అధ్యక్షులు గాండ్లపెంట ఖాదర్ బాష, కన్వీనర్ చింతం రెడ్డి వెంకట్రామిరెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడిగా బ్రహ్మానందరెడ్డి, రాయచోటి అధ్యక్షులుగా అంకం జయచంద్రారెడ్డి, జిల్లా సెక్రటరీగా రామానాయుడు, కోశాధికారిగా హరికుమార్, ఉపాధ్యక్షులుగా అల్లం రెడ్డెప్ప రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా కావలి కృష్ణతేజ, ఈసీలుగా చైతన్య చవ్వా కృష్ణారెడ్డి, ఈటీగా విద్య డి.రామిరెడ్డి, ఈసీ ఆరోగ్య కల్లూరు గంగాధర్‌రెడ్డి, ఈసీ అత్యవసర పాలకొండరాయుడు, రాయచోటి కమిటీ సెక్రటరీగా బుక్కే నాగేశ్వర నాయక్, కోశాధికారిగా టేకూరి నాగార్జున, ఉపాధ్యక్షులు పురం మురళీమోహన్ తదితరులను నూతన కమిటి సభ్యులుగా ఎంపిక చేసి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు.

అటవీ ప్రాంతాల్లో పోలీసుల తనిఖీ

సిద్దవటం : భాకరాపేట, సిద్దవటం ప్రధాన రహదారి, కడప ఫారెస్టు రేంజి పరిధిలోని పోలీసు బెటాలియన్ సమీపంలో, కనుమలోపల్లె ఫారెస్టు బీటు వద్ద, తదితర అనుమానిత ప్రదేశాల్లో ఆదివారం సిద్దవటం పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఒంటిమిట్ట సీఐ బాబు ఆదేశాలతో మండల ఎస్ఐ మహమ్మద్ రఫీ సూచనల మేరకు పోలీసులు ఓపెన్ డ్రింక్, జూదం అరికట్టేందుకు ఈ తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు, శివప్రసాద్‌రెడ్డి, రాముడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.





